## క్లుప్తంగా

### యూనివర్సిటీ బలోపేతానికి కృషి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు పీయూలో వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్‌తో మర్యాదపూర్వకంగా కలిశారు. పీయూకు అవసరం అయిన సిబ్బంది నియామకం, విద్యార్థుల అవసరాలు, ఇతర వసతులు తదితర అంశాలపై తమ దృష్టికి తీసుకువస్తే మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో వాటిని పరిష్కరిందుకు ఆస్కారం ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు యూనివర్సిటీలను పూర్తిగా నిర్వీర్యం చేశాయని, వాటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు.

### ఇథనాల్ కంపెనీ రద్దు చేయించండి

చిన్నచింతకుంట: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీని రద్దు చేయించి పరిసర ప్రాంతాల ప్రజలకు న్యాయం చేయాలని కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు బండారి లక్ష్మయ్య, డి. చంద్రశేఖర్ ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డిని కోరారు. బుధవారం దమగ్నాపురంలోని నివాసంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. సభ్యులు నాగరాజు, లక్ష్మయ్య, మనీవర్ధన్‌రెడ్డి, పి మురళీ, రామచంద్రయ్య, మల్లేష్, ఎన్‌జీ నరసింహ, ధన్వాడ బాలకృష్ణ, నరేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఆదివాసీ, లంబాడ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14న రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు జేఏసీ కన్వీనర్ రవి రాథోడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు పట్టణంలోని ఫంతూనాయక్ గిరిజన భవన్‌లో నిర్వహించే కార్యక్రమంలో పలు అంశాలపై చర్చిస్తారని అన్ని గిరిజన సంఘాలు పాల్గొనాలని కోరారు.

### బిల్లులు చేయడం లేదని నిరసన

అడ్డాకుల: కందూర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను మండల పరిషత్ అధికారులు చేయడం లేదని సర్పంచ్ శ్రీకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం అడ్డాకుల కార్యాలయంలో ఎంపీడీఓ మంజుల, ఎంపీఓ శ్రీదేవి, ఏపీఓ అతహార్, ఈసీ రమేష్ వద్ద బిల్లుల పెండింగ్‌పై నిరసన తెలిపారు. 2019లో అప్పటి కలెక్టర్ రోనాల్డ్‌రోస్ సూచన మేరకు 850 ఇంకుడు గుంతలు మంజూరు కాగా వాటిలో అదే ఏడాది 650 ఇంకుడు గుంతలను పూర్తి చేసినట్లు సర్పంచ్ తెలిపారు. వాటిలో కేవలం 240 గుంతలకే బిల్లులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ఐదారు నెలల క్రితం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేస్తే ఇప్పుడు బిల్లులు చేయడం లేదని తెలిపారు. మిగిలిపోయిన ఇంకుడు గుంతల నిర్మాణాలు పూర్తి చేస్తేనే బిల్లులు చేస్తామని అధికారులనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎంపీడీఓ మంజుల మాట్లాడుతూ చేసిన పనులకు బిల్లులు చేస్తామని తెలిపారు. కాగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సర్పంచే పాత బిల్లులు రావడం లేదని అధికారుల ముందు గోడు వెళ్లబోసుకోవడం మండలంలో చర్చనీయాంశమైంది.

### శ్రీశైలానికి యువకుల పాదయాత్ర

బాలానగర్: పెద్దరేవల్లికి చెందిన కాంగ్రెస్ యువకులు పాదయాత్రగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి బయలుదేరి వెళ్లారు. అనిరుధ్ రెడ్డి గెలుపొందితే తాము పాదయాత్రగా వస్తామని మొక్కుకున్నట్లు వివరించారు. వారిని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కలిసి పాదయాత్రను ప్రారంభించారు. నవీన్ రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఆదిరమణా రెడ్డి, అధ్యక్షుడు శంకర్ నాయక్, సీనియర్ నాయకుడు సాదు వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఆలయం వద్ద సీసీ పనులు



అడ్డాకుల: కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం సీసీ పనులను చేయించారు. ఆలయం బయట ప్రహరీ చుట్టూ దాత మహేందర్‌రెడ్డి సహకారంతో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయాభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్ కోరారు.

### సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని నిర్వహించిన ధరణి పోర్టల్ సమీక్షలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ధరణి పోర్టల్‌పై పలు అంశాలను ఈసందర్భంగా ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

# ఓటరు జాబితాపై నిర్లక్ష్యం వద్దు



సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావ్

నవాబుపేట: ఓటర్ల జాబితాపై నిర్లక్ష్యం చేయకుండా అధికారులు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో బీఎల్‌ఓలు ఎప్పటికపుడు అప్‌డేట్ చేయాలని వారికి వచ్చిన వినతులు వెంటనే తహసీల్దార్ కార్యాలయంలో అందించి ఆన్‌లైన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ మల్లికార్జున్ రావు, ఎంపీడీఓ శ్రీలత, ఆర్‌ఐలు గోవర్ధన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్: అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) మోహన్‌రావ్ పేర్కొన్నారు. బుధవారం రాజాపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా బీఎల్‌ఓలు ఓటరు లిస్టులో పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. అంతేకాకుండా మరణించిన వారి పేర్లు ఓటరు లిస్టులో కనిపించకుండా చూసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని గుర్తించి ఓటు నమోదు చేయించాలన్నారు. తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, డీటీ భరత్‌కుమార్, ఆర్‌ఐ ఖదీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సెస్సీ విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న డీఈఓ రవీందర్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్ట పాఠశాలలో చదువుతున్న ఎస్సెస్సీ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈఓ రవీందర్ హాజరై ప్రసంగించారు. చక్కటి ప్రణాళిక, సాధించాలన్న తపన ఉంటే జీవితంలో ఏదైనా సాధించగలరన్నారు. ఎస్సెస్సీ పరీక్షలు దగ్గరికి వస్తున్న క్రమంలో విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మంచి అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు. సైకాలజిస్టు లక్ష్మణ్, హెచ్‌ఎం సేవ్యా, సామాజిక కార్యకర్త యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలకు పంపాలి



లింగంపేట గ్రామంలో ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ మంజులాదేవీ

జడ్చర్ల టౌన్: బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు ఇంట్లో పెట్టుకోకుండా తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని ఎంఈఓ మంజులాదేవీ పిలుపునిచ్చారు. బుధవారం లింగంపేటలో బడిఈడు పిల్లల సర్వేను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ నుద్దేశించి ఆమె మాట్లాడుతూ పిల్లలు ఎవరైనా బడికి రాకుండా ఉంటే వారిని గుర్తించి పాఠశాలకు వచ్చేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. గ్రామంలోని యువత, మహిళాసమాఖ్య సభ్యులు, ప్రజాప్రతినిధులు సైతం సహకరించి సర్వేకు సహకరించాలన్నారు. నెలరోజుల పాటు నిర్వహించే సర్వే ప్రతి గ్రామంలోనూ కొనసాగుతుందన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసులు, హెచ్‌ఎం సుజాత పాల్గొన్నారు. అనంతరం గంగాపురం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ సందర్శించారు. అక్కడ ఎఫ్‌ఎల్‌ఎన్ అమలుతీరును పరిశీలించారు. పాఠశాలలో బోధన, విద్యార్థుల సామర్థ్యాలను ప్రశంసించారు. ఆమె వెంట స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అనంతప్ప, పాఠశాల హెచ్‌ఎం నిర్మల ఉన్నారు.

## కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

చిన్నచింతకుంట: బీఆర్‌ఎస్ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని తాము అండగా ఉన్నామని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయన్నాయని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో సర్పంచులను గెల్పించుకునేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శివాంజనేయ రథోత్సవం



ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

దేవరకద్ర: నార్లోనికుంట్ల శివాంజనేయస్వామి ఆలయంలో బుధవారం తెల్లవారు జామున ఘనంగా రథోత్సవం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, భక్తులకు ప్రసాదాల పంపిణీ నిర్వహించారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను నాయకులు ఘనంగా సన్మానించారు.

దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పురోహితులు, దేవస్థాన అధికారులు, నాయకులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే ఆహ్వాన ప్రతిని అందజేశారు. కాగా ఈ నెల 24 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. మాజీ జడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, ఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ



వెన్నాచేడ్‌లో ఊరేగింపు



రాయపల్లి పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

రాజాపూర్: కార్తీకమాస అమావాస్య సందర్భంగా మండలంలోని రాయపల్లిలో బుధవారం శ్రీశివాంజనేస్వామి ఆలయం నుంచి భజనలు చేస్తూ పురవీధుల గుండా హనుమంతుడి పల్లకీసేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. అఖండ భజన నిర్వహించారు. అల్లాపురం వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, సర్పంచ్ గంగాధర్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, ఆలయకమిటీ చైర్మన్ పుల్లయ్య, పూజారి రాములుచారీ, కావలి రవి, బాలయ్య, పాండయ్యగౌడ్, యాదయ్య, చెన్నయ్య, మహేష్‌గౌడ్, ప్రవీణ్, బాలయ్య పాల్గొన్నారు.

గండేడ్: కార్తీక మాసం ముగింపు కార్యక్రమాన్ని ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. బుధవారం మండల పరిధిలోని లింగాయిపల్లి, వెన్నాచేడ్, రెడ్డిపల్లి, గండేడ్, కొంరెడ్డిపల్లి, మన్సూర్‌పల్లి తదితర గ్రామాల్లో ముగింపు ఉత్సవాలను నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు అఖండ భజన కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం ఆంజనేయస్వామి వారికి అభిషేకం , అష్టోత్తర శతనామావళి, మహామంగళ హారతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో బంతిపూలతో ఆంజనేయుడిని అలంకరించి ఎడ్లబండ్ల మీద, ట్రాక్టర్ల మీద ఊరేగించారు. భజనం కోలాటం, ఆటపాటలతో గ్రామాల్లోని వీధుల గుండా తిరుగుతూ దేవాలయానికి చేరుకొని ముగింపు పలికారు. తీర్థప్రసాదాల వితరణతో పాటు అన్నదాన కార్యక్రమాలను చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు భజనమండళ్ల భక్తులు హనుమాన్ మాలధారకులు పాల్గొన్నారు.

హన్వాడ: మండలకేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాసం ఉత్సవాలు బుధవారం ముగిశాయి. అఖండ భజనలు, భక్తులకు అన్నదానం చేశారు. అంతకుముందు ఆంజనేయస్వామి శోభాయాత్ర నిర్వహించారు. ఆలయకమిటీ చైర్మన్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మోసాలపై విచారణ చేపట్టాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవకతవకలు, మోసాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రగతి శీల సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. భూకుంభకోణం, ఎక్సైజ్, పేపర్‌లీక్ స్కాం, డబుల్ బెడ్‌రూమ్ స్కాంలు తదితర విషయాల్లో చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా అధ్యక్షుడు అహ్మద్‌ఖాన్, ప్రధానకార్యదర్శి అనీల్‌కుమార్, తారిక్ అన్వర్, రాంచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి జూపల్లిని కలిసిన నాయకులు

అడ్డాకుల: ఉమ్మడి అడ్డాకుల మండలానికి చెందిన మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జి.రామన్‌గౌడ్, మహబూబ్‌నగర్‌కు చెందిన కౌన్సిలర్ బురుజు సుధాకర్‌రెడ్డి తదితరులు బుధవారం మంత్రి జూపల్లి కృష్ణారావును కలిశారు. బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### చర్యలు తీసుకోండి

మహబూబ్‌నగర్ రూరల్: దేవరకద్రలోని సాంఘిక సంక్షేమశాఖ ఎస్సీ గురుకుల పాఠశాలలో విద్యార్థులను ప్రిన్సిపాల్ చీటికిమాటికి ఏదో కారణం చూపి కొడుతున్నారని.. ఆయనపై ఆర్సీఓ చర్యలు తీసుకోవాలని మాలల చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మూలె కేశవులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో సమావేశంలో మాట్లాడారు. తోటి ఉపాధ్యాయులతోనూ ఆయన అసభ్యకరంగా ప్రవర్తిస్తూ మానసికంగా వేధిస్తున్నాడని, ఈ విషయం ఆర్సీఓ దృష్టికి తీసుకెళ్దామనుకుంటే ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని అన్నారు. చర్యలు తీసుకోని పక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. పత్తి యాదయ్య, వెంకట్రాములు, శ్రీనివాసులు, విష్ణు, నరసింహా, రాజు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

### హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థులు



మహబూబ్‌నగర్ క్రీడలు: ఢిల్లీలో ఈనెల 16 నుంచి 21 వరకు జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు జి.వర్ష, కె.అక్షయ్‌లు ఎంపికయ్యారు. విద్యార్థులను బుధవారం పాఠశాలలో కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శాంత అభినందించారు. పోటీల్లో ప్రతిభచాటాలని ఆకాంక్షించారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండి.జియావుద్దీన్, పీఈటీలు ప్రశాంతి, సురేష్‌కుమార్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

### హెచ్‌ఎంకు ఘన సన్మానం



మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గజిటెడ్ హెచ్‌ఎం రవికుమార్ బదిలీపై వెళ్తుండడంతో బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, పాఠశాలలో గతంలో పనిచేసిన ఉపాధ్యాయులు రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ గౌస్, హెచ్‌ఎం సరస్వతి, ఎస్‌ఎంసీ చైర్మన్ సురేందర్‌గౌడ్, ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, రవిశంకర్, శ్రీశైలం, నాగమణి, అరుణ, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

### అడ్డాకులలో మహా పడిపూజ



అడ్డాకుల: మండల కేంద్రంలోని శివాంజనేయ శిరిడిసాయి ఆలయంలో బుధవారం భక్తులు అయ్యప్ప దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. కలశపూజ, స్వామివారి ఊరేగింపు నిర్వహించిన తర్వాత మహాపడిపూజ చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. జెడ్పీటీసీ సభ్యుడు ఎన్.రాజశేఖర్‌రెడ్డి ఆలయానికి వచ్చి పూజలో పాల్గొన్నారు.

## అవినీతి అక్రమాలపై ఉక్కుపాదం



ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న పూజారులు, అధికారులు

జడ్చర్ల: అవినీతి అక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్లలోని పార్టీలో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ శ్రేణులు తమపై బురదజల్లుతున్నారని అన్నారు. నవాబ్‌పేట మండలంలో ఇసుక మాఫియాకు సంబంధించి 13 మందిపై కేసులు నమోదు చేయించామని, ఇసుక నిల్వలను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని అధికారులను, పోలీసులను ఆదేశించామని తెలిపారు. మున్సిపాలిటీలో అవినీతి రహిత పాలనను అందిస్తామన్నారు. లంచం అడిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జడ్చర్ల చుట్టూ రింగ్‌రోడ్డు నిర్మించేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పటికే కలిసి కోరారని అన్నారు. రూ. వంద కోట్లతో రోడ్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల విషయంలో అక్రమాలపై నిగ్గు తేలుస్తామన్నారు. వాటికి సంబంధించి ఎవరికైనా డబ్బులు ఇచ్చి ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అవినీతి అక్రమాలలో కౌన్సిలర్ల పాత్రను విచారించి చర్యలు చేపడుతామన్నారు. భూ కబ్జాలపై చర్యలు ఉంటాయని వివరించారు. వివిధ భూములపై సర్వేలు చేసి నివేదికలను ఇవ్వాల్సిందిగా జిల్లా కలెక్టర్‌ను కోరామని తెలిపారు. బీఆర్‌ఎస్‌లో అవినీతి మరకలు ఉన్నవారిని కాంగ్రెస్‌లోకి రానిచ్చేది లేదని స్పష్టం చేశారు. అభివృద్ధికి అందరి సలహాలను స్వీకరిస్తామని, జడ్చర్లలోని క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అదేవిధంగా జడ్చర్ల రైల్వే స్టేషన్ సమీపంలో చేపట్టిన ఆర్‌యూబీ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఎమ్మెల్యే సూచించారు. పనులను పరిశీలించి పురోగతిని తెలుసుకున్నారు. మాజీ జెడ్పీటీసీ రబ్బానీ, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా కిసాన్‌ఖేత్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: సెంటిమెంట్ దేవతగా పేరుగాంచిన పర్వతాపూర్ మైసమ్మను ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మొదటి సారిగా మండలానికి వచ్చిన ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కారుకొండలో భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. అక్రమ ఇసుక రవాణా అరికడతామని, గ్రామంలో నిరుపేదలకు ప్లాట్లు ఇస్తామని వివరించారు. కార్యకర్తలు ఆయనను సన్మానించారు. డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రంగారావు, బంగ్లరవి, పీసీసీ నాయకులు జహీర్, మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## సాదాసీదాగా సమావేశం



ప్రగతినివేదిక చదివి వినిపిస్తున్న అధికారి

హన్వాడ: మండలకేంద్రంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఐదేళ్లుగా పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిదులకు ఈ సమావేశం చివరిది కావడంతో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళా ప్రజాప్రతినిధులు ఆత్మీయ పలకరించుకున్నారు. అంతకుముందు అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీడీఓ ధనుంజయగౌడ్, తహసీల్దార్ కిష్టునాయక్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నవాబుపేటలో క్షయ నివారణ శిబిరం



శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

నవాబుపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం క్షయ నివారణ శిబిరం నిర్వహించారు. జిల్లా అధికారి డాక్టర్ రఫీక్, డాక్టర్ నవీన్ చంద్రల వైద్య బృందం పరీక్షలు చేసి సలహాలు అందించారు. లక్షణాలు ఉన్న వారికి రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య బృందం శరభలింగం, రాఘవేందర్, అవినాష్ తదితరులు ఉన్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



కరపత్రాలతో నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న ఢిల్లీలో నిర్వహించ తలపెట్టిన ధర్నా కరపత్రాలను నాయకులు విడుదల చేశారు. టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, నాయకులు రాములు, మహేశ్వర్, శ్యామ్, రాజు, చంటి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని దక్షిణ తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. బుధవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వర్గీకరణ చేయకపోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజలు బీజేపీకి ఓటుతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య, ప్రధాన కార్యదర్శి అంజన్న, నాయకులు పాల్గొన్నారు.

## అలరించిన సెమీ క్రిస్మస్ వేడుకలు



కొవ్వొత్తులు వెలిగిస్తున్న క్రైస్తవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కల్వరి ఎంబీ చర్చి ఆవరణలో బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాయక బృందం ఆధ్వర్యంలో భక్తిగీతాలు ఆలపించారు. ఎంబీసీ చైర్మన్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రైస్తవులు కొవ్వొత్తులను వెలిగించి ప్రదర్శించారు. కేక్‌కట్ చేశారు. హైదరాబాద్‌లోని డెస్టినేషన్ చర్చి పాస్టర్ రెవరెండ్ సైలస్ రెజినాల్డ్ ముఖ్య సందేశం ఇచ్చారు. బైబిల్‌లోని పలు ఘట్టాలను చదివి వినిపించారు. ఏసుక్రీస్తు మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో చిన్నారులు, యువత చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎంబీసీ చర్చి వైస్ చైర్మన్ బీఐ.జేకబ్, కార్యదర్శి జేఐ.డేవిడ్, కోశాధికారి టీఏ.స్టిఫెన్, సంయుక్త కార్యదర్శి ఇమ్మాన్యుయేల్ రాజు, దాసరి సుందర్, పాస్టర్లు డానియల్ సుధీర్, మరియన్, సుందర్‌పాల్, డాక్టర్ శామ్యుల్, ఏసుపాదం, డాక్టర్ విజయ్‌కాంత్, డాక్టర్ ప్రణయ్, కన్నా పాల్గొన్నారు.